www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 జనవరి 2023
5
ఏలూరు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మక్కినవారిగూడెం విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో యాజమాన్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలకు మక్కినవారిగూడెం హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని పి.ప్రశాంతి ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం జి.ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీల్లో విజయనగరం జిల్లాలో రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ బాలికల పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ పోటీలకు ప్రశాంతి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. బాలికలు క్రీడలు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినిని పిఈటి ఎస్.ప్రభాకర్, ఎస్ఎంసి చైర్మన్ నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తూతూమంత్రంగా జెడ్‌పి సమావేశం

పత్తా లేని మంత్రులు, ఎంఎల్‌ఎలు
కలెక్టర్ సైతం సమావేశానికి దూరం
జెడ్‌పి చరిత్రలోనే అత్యంత పేలవంగా సర్వసభ్య సమావేశం
తాగునీరు, ధాన్యం, విద్యా సమస్యలపై జెడ్‌పిటిసిల ప్రశ్నలు
అఫ్ నాలెడ్జ్ సిఇఒతో ప్రభుత్వ ప్రతిష్టకు దెబ్బ: నరసాపురం జెడ్‌పిటిసి



ఖాళీగా ఉన్న కుర్చీలు..

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజా సమస్యలపై చర్చలు, పరిష్కారాలకు వేదికగా నిలవాల్సిన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా ముగిసేచేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరిగిన తీరు చూసిన వారంతా ఇలాంటి దారుణమైన సమావేశం జిల్లా పరిషత్ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని విమర్శలు వెల్లువెత్తాయి. జిల్లా పాలనకు వెన్నుముకగా జిల్లా పరిషత్‌ను పేర్కొంటారు. అటువంటి జెడ్‌పి సమావేశంలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని స్థానిక ప్రజాప్రతినిధులంతా వెయ్యికళ్లతో ఎదురుచూస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలంతా ఈ సమావేశానికి హాజరై ప్రజాసమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేస్తారు. అదే సమయంలో కలెక్టర్, జిల్లాలోని అన్నిశాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పనిసరిగా రావాల్సి ఉంటుంది. అలాంటి సమావేశానికి జిల్లా కలెక్టరుగానీ, ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా మంత్రులతోపాటు, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 నియోజకవర్గాల్లోని ఏఒక్క ఎంఎల్‌ఎగానీ హాజరు కాకపోవడం గమనార్హం. జిల్లా కలెక్టరుకు వేరే ముఖ్యమైన పని ఉంటే జెసి హాజరయ్యేవారు. ఈ సమావేశంలో అదీ లేకుండాపోయింది. వేదికపై జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్, సిఇఒ కె.రవికుమార్ మాత్రమే ఉన్నారు. ఉదయమే స్థాయి సంఘాల సమావేశం నిర్వహించి మధ్యాహ్నం రెండుగంటల తర్వాత సర్వసభ్య సమావేశం సుమారు రెండు గంటలపాటు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్, విద్య, వ్యవసాయం, ఇరిగేషన్, డిఆర్‌డిఎ, సాంఘిక సంక్షేమ శాఖలపై మాత్రమే చర్చ నిర్వహించి తూతూమంత్రంగా సమావేశం కానిచ్చేశారు.

చూస్తాం.. చేస్తామంటూ ముక్తసరి సమాధానాలు

జిల్లా పరిషత్ సమావేశంలో వివిధ మండలాలకు చెందిన జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పలు సమస్యలను లేవనెత్తారు. ముసునూరు మండలంలో తాగునీటికి సంబంధించిన ఇబ్బందులపై అక్కడ జెడ్‌పిటిసి ప్రస్తావించారు. జలజీవన్ మిషన్‌కు పదిశాతం నిధులు కట్టాలని చెప్పడంపై ప్రశ్నించారు. పోలవరం మండలం రామయ్యపేటలో తాగునీటికి పైప్‌లైన్ వేయాలని, వేలేరుపాడు మండలం రామవరపు పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు ఒకే ట్యాంక్ ఉందని, మరో రెండు ట్యాంకులు కావాలని, రేపాకగొమ్ములోనూ చేతిపంపులు కావాలని ఆయా సభ్యులు కోరారు. భీమడోలు మండలం ఆగడాలంక, చెట్టున్నపాడు, లక్ష్మీపురంలో పది రోజులుగా తాగునీరు లేదని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భీమడోలు ఎంపిపి తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు నిధులు మంజూరయ్యాయి.. ప్రణాళికదశలో ఉన్నాయని, చేస్తాం.. చూస్తామనే సమాధానాలతోనే అధికారులు సరిపెట్టారు. ఆచంట జెడ్‌పిటిసి మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన జూనియర్ కాలేజీలో ఇప్పటి వరకూ ఒక్క లెక్చరర్‌ను కూడా నియమించలేదని, మార్చిలో ఇంటర్ పరీక్షలు విద్యార్థులు ఎలా రాయాలని, ల్యాబ్‌లు లేవని ప్రశ్నించారు. ఇదే సమస్య జిల్లావ్యాప్తంగా ఉందన్నారు. దీనిపై డిఇఒ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటాం, సమస్యను పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం గిరిజన పాఠశాలలో నూతన భవన నిర్మాణం ప్రారంభించి మధ్యలో ఆపేశారన్నారు. చింతలపూడి మండలంలో జరిగే పనుల గురించి ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం కూడా ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజనంలో ఉపయోగించే బియ్యం నాసిరకంగా ఉన్నాయని ప్రస్తావించారు. ప్రొటోకాల్ సమస్యకు సంబంధించి ప్రతి సమావేశంలోనూ చర్చ జరుగుతుందని, అయినా పరిస్థితిలో మార్పు లేదని, అధికారులు సరిగా పని చేయకపోవడంతో చేసిన పనులకు బిల్లులు కూడా కావడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లకు సంబంధించి ఏలూరు జిల్లాలో 1400 మాత్రమే అనర్హమైనవని తేలాయని అధికారులు తెలిపారు. తొలగించినంత సులువుగా ఆధారాలు చూపినప్పటికీ మళ్లీ ఇవ్వడం లేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పోలవరం మండలంలో సమస్యలపై ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడ జెడ్‌పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

తేమశాతం తేడా ఎందుకంటూ ఆగ్రహం

ధాన్యం కొనుగోలులో రైతుభరోసా సిబ్బంది తేమశాతం 17 శాతంలోపుగా నిర్ధారించిన తర్వాత మిల్లర్లు 20 శాతంగా పేర్కొని సొమ్ము కట్టించుకోవడం ఏమిటని సభ్యులంతా ముక్తకంఠంతో ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయాధికారులు, పౌర సరఫరాల శాఖాధికారులు ఇచ్చిన సమాధానాలకు సభ్యులు సంతృప్తి చెందలేదు. లారీలు ఉండటం లేదని, గోనె సంచుల ఇబ్బందులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సభ చివరిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.47 కోట్లు బడ్జెట్‌కు అమోదం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

అఫ్ నాలెడ్జ్ సిఇఒతో ప్రభుత్వానికి చెడ్డపేరు

బొక్కా రాధాకృష్ణ, నరసాపురం జెడ్‌పిటిసి



జెడ్‌పి సిఇఒ రవికుమార్ నియంతలా వ్యవహరిస్తున్నారని, సగం పరిజ్ఞానం ఉన్న వ్యక్తి సిఇఒగా ఉండటం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని నరసాపురం జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో జెడ్‌పిటిసికి రూ.కోటి నిధులను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కేటాయిస్తే నరసాపురం మండలానికి రూ.40 లక్షలు మాత్రమే ఇచ్చారని, దీనిపై అనేకసార్లు తిరిగినా ఫలితం లేకుండాపోయిందని అన్నారు. మీకు నిధులివ్వాలంటే జిల్లా పరిషత్ భవనం అమ్మేయాలని సిఇఒ వెటకారంగా మాట్లాడారన్నారు. జెడ్‌పిటిసిలంటే సిఇఒకు ఏమాత్రం గౌరవం లేదన్నారు. అభివృద్ధి పనులు జరగకుండా సిఇఒ అడ్డుపడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మండిపడ్డారు. జెడ్‌పి ఛైర్మన్ చెప్పి పంపించినా నిధులపై లెక్కలేనితనంగా సిఇఒ వ్యవహరిస్తున్నారని, అధికారులను సైతం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. జెడ్‌పిటిసి మాట్లాడుతుండగా సిఇఒ మైక్ కట్‌చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పి ఛైర్మన్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జెడ్‌పి ఛైర్మన్ కష్టపడుతున్నా సిఇఒ తీరుతో అప్రతిష్ట ఏర్పడుతుందన్నారు. జెడ్‌పి ఛైర్మన్ కేవలం నిమిత్త మాత్రుడని, జెడ్‌పి సిఇఒనే అన్నీ తానై వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో జెడ్‌పి సమావేశంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆరోపణలకు నిలువుటద్దమైంది. జెడ్‌పి సిఇఒ వ్యవహార శైలి ఆది నుంచి వివాదాస్పదంగానే ఉన్నట్లు చర్చసాగుతోంది. జిల్లా పరిషత్ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన వివరాలు ముద్రించిన పుస్తకాలను సభ్యులకు, మీడియాకు అందించేవారు. వాటిని సైతం మీడియాకు అందించకపోవడం సిఇఒ తీరుకు నిదర్శనం. సమావేశానికి కలెక్టర్, మంత్రులు, ఎంఎల్‌ఎలు హాజరై ఉంటే జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ప్రస్తావించిన సమస్యలకు వెంటనే పరిష్కారం దొరికేదనే చర్చ సైతం నడిచింది.

ఆశలు.. ఆకాంక్షలు

కొత్త సంవత్సరం 2023లోకి ప్రవేశించాం. మారేది క్యాలెండరే అయినా సామాన్యుల దగ్గర నుంచి పాలకులు, అధికారుల వరకూ అంతా కొన్ని ఆలోచనలతో అడుగులు వేయడం సహజం. కొత్త సంవత్సరంలో ఆ ఆలోచనలు ఏమిటీ.. ఆకాంక్షలు ఏమిటీ అనే దానిపై జిల్లాలోని కొందరు ప్రముఖులను ప్రజాశక్తి పలుకరించింది. వారి మనోగతం వారి మాటల్లోనే..



ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

కవురు శ్రీనివాస్, జెడ్‌పి ఛైర్మన్



ఉమ్మడి జిల్లాలోని ప్రజలందరికీ, అధికారులకు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం 2023లో ప్రజలందరికీ మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. కొత్త ఏడాదిలో ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆంక్షాస్తున్నాం.

కొత్త ఆశయాలు, లక్ష్యసాధనతో ముందుకు

ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్



నూతన సంవత్సరంలోకి అడుపెడుతున్న శుభతరుణంలో జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు శుభాకాంక్షలు. అందరి సమిష్టికృషితో కొత్త ఏడాది నూతన ఆశయాలతో, లక్ష్యసాధనతో ముందుకు సాగుతూ జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం.

కొత్త ఏడాదిలో నేరాల తగ్గింపు దిశగా చర్యలు

రాహుల్ దేవ్ శర్మ, జిల్లా ఎస్‌పి



ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. అంతా అనందంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలి. 2023లో నేరాలు మరింత తగ్గించే దిశగా ముందుగా సాగుతాం. సైబర్ నేరాలపై జనాలకు మరింత అవగాహన కల్పించేందుకు కృషిచేస్తాం. నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు చేపడతాం.

సిపిఎం అభిమాని అక్కినేని సత్యనారాయణ మృతి



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పెదపాడు

పాతతరం కమ్యునిస్టు నేత, సిపిఎం అభిమాని, నాయుడుగూడెం పంచాయతీ మాజీ సర్పంచి అక్కినేని సత్యనారాయణ(సత్యం) (94) వయోభారంతో శనివారం మృతి చెందారు. ఆయన భార్య గతంలోనే మృతిచెందారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమారుల్లో ఒకరు మృతిచెందారు. కమ్యూనిస్టు భావజాలం కలిగిన ఆయన అక్కినేని శ్రీవల్లీ నర్రా ఆంజనేయులు ట్రస్టు పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అక్కినేని శ్రీవల్లీ గ్రంథాలయాన్ని స్థాపించి విద్యార్థులకు ప్రతీ సంవత్సరం పోటీలు నిర్వహించి వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ తరుణంలో ఆయన వయోభారంతో మృతిచెందారు. సత్యం మృతదేహాన్ని ఆశ్రం మెడికల్ కళాశాలకు అందించారు. ఆయన మృతికి సిపిఎం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కమిటీలు సంతాపం తెలిపాయి. సిపిఎం సీనియర్ నాయకులు ఆర్.సత్యనారాయణ రాజు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, కె.రాజారామ్మోహన్ రాయ్, పివి.ప్రతాప్, కె.శ్రీనివాస్, పళ్లెం కిషోర్ ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్కినేని సత్యం కమ్యునిస్టు ఉద్యమానికి, ప్రజా సంఘాలు ఉద్యమాలకు ఎంతో మద్దతుగా నిలిచారన్నారు. వామపక్ష భావాలతో జీవించిన సత్యం మృతి తరువాత కూడా సమాజానికి ఉపయోగపడేలా ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి డొనేట్ చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. ఇది ఎంతో అభినందనీయన్నారు.



అక్కినేని సత్యం (ఫైల్)

గుండెపోటుతో తహశీల్దార్ కార్యాలయ సబార్డినేట్ మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

తహశీల్దార్ కార్యాలయ సబార్డినేట్ షేక్ ఫీరా(53) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు తహశీల్దార్, రెవెన్యూ ఉద్యోగులు గణపవరం వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపి బయటకు రాగానే ఒక్కసారిగా ఫీరా సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయారని వైద్యులు తెలిపారు. ఫిరా మృతితో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సిఐటియు రాష్ట్ర మహాసభకు సర్వంసిద్ధం

భారీ సభా వేదిక, 30 వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు
భీమవరంలో కార్మికుల పండుగ వాతావరణం
నేడు జిల్లాకు మూడు కార్మిక చైతన్య యాత్రలు

ప్రజాశక్తి - భీమవరం

సంస్కృతి, సంప్రదాయాలతోపాటు ఆతిథ్యంలో పెట్టింది పేరు గోదావరి జిల్లాలైతే.. ఉద్యమాల పురిటిగడ్డ.. రెండో బార్డోలిగా పేరొందిన భీమవరంలో మొట్ట మొదటిసారిగా సిఐటియు ఆవిర్భవించాక తొలిసారి రాష్ట్ర మహాసభకు భీమవరం వేదికైంది. జనవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజులపాటు 16వ రాష్ట్ర మహాసభ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చనున్నారు. ఈ నేపథ్యంలో భీమవరంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్మిక నేతలంతా ఒకచోటకు చేరి ప్రభుత్వ విధానాలను ఎండగడంతోపాటు హక్కులను కాపాడుకునేందుకు ప్రణాళిక రచించి కదం తొక్కనున్నారు. 2న భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహణతోపాటు 3, 4 తేదీల్లో ప్రతినిధుల సభ జరగనుంది. ఈ మహాసభకు సంబంధించిన ఏర్పాట్లను ఆహ్వాన సంఘం ఇప్పటికే పూర్తి చేసింది.

బహిరంగ సభా వేదిక సిద్ధం

కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కేశవరావు హైస్కూల్‌లో రెండో తేదీన భారీ బహిరంగ సభ జరగనుంది. కార్మిక, ఉద్యోగుల భారీ ప్రదర్శనతో పాటు బహిరంగ సభకు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలతోపాటు పరిసర జిల్లాల కార్మికులు పెద్దసంఖ్యలో తరలి రానున్నారు. జాతీయ, రాష్ట్ర నేతలు ఆశీనులయ్యేందుకు భారీ సభా వేదిక ఏర్పాటు చేశారు. సుమారు 30 వేలమంది సభా ప్రాంగణంలో కూర్చొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంగణం అంతా చదును చేయడంతోపాటు చుట్టూ తోరణాలు, జెండాలతో అలంకరించారు. ఈ నేపథ్యంలో బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతమంతా అరుణారుణమై చూపరులను ఆకట్టుకుంటుంది. స్థానికంగా పండుగ వాతావరణం ఏర్పడింది.

నేడు జిల్లాలోకి ప్రవేశించనున్న బస్సు యాత్రలు

సిఐటియు రాష్ట్ర మహాసభ నేపథ్యంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి మూడు కార్మిక చైతన్య (బస్సు) యాత్రలు ఈ నెల 28న ప్రారంభమయ్యాయి. ఇచ్ఛాపురం, కుప్పం, శ్రీకాకుళం జిల్లా మందాడ నుంచి ప్రారం భమైన ఈ యాత్రలు ఆదివారం సాయంత్రం మన జిల్లాలోని తాడేపల్లిగూడెం చేరుకో నున్నాయి. ఈ యాత్రలకు ఘన స్వాగతం పలికేందుకు అక్కడ ఏర్పాట్లు చేశారు. అక్క డ నుంచి రెండో తేదీ ఉదయం ప్రారంభమయ్యే భారీ మోటార్ సైకిల్ ర్యాలీ అదేరోజు మధ్యాహ్నం భీమవరం పట్టణంలో నిర్వహించే భారీ ప్రదర్శనలో కలవనుంది.

చురుగ్గా ఏర్పాట్లు

మహాసభ నిర్వహణకు ఆహ్వాన సంఘం ఏర్పాటైన నాటి నుంచి ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌తోపాటు సిఐటియు, వివిధ కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు చురుగ్గా ఏర్పాట్లు చేశారు. ఒకపక్క ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమైనప్పటికీ మరోపక్క రెండు జిల్లాల్లో విస్తతంగా ప్రచారం సాగించారు. అన్ని తరగతుల ప్రజలతోపాటు కార్మికులను సమాయత్తపర్చారు. ముఖ్యంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రపంచ ఆర్థిక మాంద్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తదితర అంశాలపై భీమవరంలో రెండు సదస్సులు, తణుకు, తాడేపల్లిగూడెంలో ఒక్కోటి చొప్పున సదస్సులు నిర్వహించి అందరిలో చైతన్యాన్ని నింపారు.

నిడమర్రు: ఈనెల 2, 3, 4 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన నిడమర్రు, మందలపర్రు, భువనపల్లి గ్రామాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన రమణరావు మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులు మహాసభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఎం.పెంటారావు, మోహన్, చంద్రరావు, వెంకన్న పాల్గొన్నారు.

గణపవరం : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రమణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ గణపవరం, సరిపల్లి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, కౌలు రైతు, రైతు సంఘం నాయకులు శ్రీను, శ్రీనివాస్, పట్నాల శ్రీనివాస్, పివిఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం.. కొంగొత్త ఆశలు




'కాలగమనంలో మరో ఏడాది గడిచిపోయింది.. విష్ యూ హ్యాపీ న్యూఇయర్' అంటూ కుర్రకారు సందడి నడుమ కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరం 2023 మన ముందు ఆవిష్కృతమైంది. గోడపై పాత క్యాలెండర్ పోయి కొత్త క్యాలెండర్ వచ్చినట్లే మన మదిలో నిరంతరం మెదిలే ఆకాంక్షలు సరికొత్త ఆశలుగా.. వాటి సాధనకు, ఆలోచనలకు పదును పెడుతూ ప్రణాళికలు రచించడం అన్ని తరగతుల ప్రజల్లో సర్వసాధారణంగా జరిగేది. గడిచిన కాలం ఒక గుణపాఠం.. భవిష్యత్తుకు ఒక పునాదిలా పాత, కొత్త మేళవించిన ఆలోచనలతో కొంగొత్త ప్రణాళికలు రచించి అడుగులు ముందుకేసే సమయం ఆసన్నమైంది.

కాలచక్రంలో గడిచిన మరో ఏడాది
నూతన సంవత్సరానికి ఘన స్వాగతం
గతేడాది అందరిలోనూ అసంతృప్తే
ఈ ఏడాదైనా ప్రజల కష్టాలు తీరేనా..!

నూతన సంవత్సరంలో తొలిరోజే ఎలా గడుస్తుందోనని పండుటాకులు, వికలాంగులు, వితంతువుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా పింఛన్ల పున:పరిశీలన పేరుతో రెండు జిల్లాల్లో వేలాది మందికి నోటీసులిచ్చిన నేపథ్యంలో తమకు పింఛన్ సొమ్ము అందుతుందా.. లేదా అనే ఆవేదనతో ఆ జాబితాలోని లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారు. సాంకేతిక అంశాలు పక్కన పెట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు ఇవ్వాలని పండుటాకులు వేడుకుంటున్నారు. వారి ఆకాంక్ష నెరవేరుతుందో.. లేక ప్రభుత్వం నీళ్లు చల్లుతుందో మరికొద్దిసేపట్లో తెలియనుంది.

ఇక పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు ఈ సంవత్సరంలోనైనా ఆకాశం నుంచి కిందికి దిగిరావాలని అన్ని తరగతుల ప్రజలు కోరుకుంటున్నారు. ఇక జిల్లాలో వరి, ఆక్వా రైతులు 2022లో పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గతంలో ధర కోసం పోట్లాడిన రైతన్న మేం పండించిన ధాన్యం కొనండి, అమ్మిన ధాన్యానికి డబ్బులివ్వండి అని మొరపెట్టుకునే దీన స్థితికి పాలకుల విధానాలు తీసుకొచ్చాయి. నూతన సంవత్సరంలో ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు తొలగడంతోపాటు సొమ్ము అందేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని రైతులు కోరుతున్నారు. ఇక డాలర్ పంట ఆక్వా రైతులు రొయ్య ధర గణనీయంగా పడిపోవడంతో తల్లడిల్లుతున్నారు. సాగు చేద్దామంటే మొక్కలు అందక పామాయిల్ రైతులు అధిక ధరకు బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొబ్బరి, కూరగాయలు, అరటి, మొక్కజొన్న, మామిడి, పొగాకు తదితర పంటల రైతులు అటు ప్రకృతి వైపరీత్యాలు, ఇటు ప్రభుత్వాల విధానాలతో తల్లడిల్లుతున్నారు. ఈ కొత్త సంవత్సరంలో తమ కష్టాలు గట్టెక్కాలని వారు పుడమి తల్లిని కోరుతున్నారు.



ఇక పరిశ్రమల్లో 2022లో చోటుచేసుకున్న ప్రమాదాలు శ్రమ జీవుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నాయి. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ప్రాంతంలోని ఫుడ్‌ఫ్యాట్స్, కడియద్దలో బాణసంచా తయారీ పరిశ్రమ వద్ద చోటుచేసుకున్న పేలుళ్లలో పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. లింగపాలెం మండలం భోగోలులో తోటలో నిద్రిస్తున్న వలస కార్మికులు పిడుగుపాటుకు విగతజీవులయ్యారు. ఇలా వివిధ ప్రమాదాల్లో గతేడాది పెద్దసంఖ్యలో శ్రమజీవులు ప్రాణాలు కోల్పోయారు. పొట్టకూటి కోసం రెక్కల కష్టం చేసే కార్మికుల ప్రాణాలకు ఈ ఏడాదిలోనైనా భరోసా దక్కాలని, పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు, అధికారులు పని చేయాలని అంతా కోరుతున్నారు.

ఇక 2022 ఉద్యోగుల పోరాట పటిమను చాటిన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. అదేస్థాయిలో ప్రభుత్వ నిర్బంధమూ ఉద్యోగులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా పిఆర్‌సి, సిపిఎస్ రద్దు విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువులు గళమెత్తిన తీరు ప్రభుత్వ పెద్దలకు గగుర్పాటు కల్గించింది. జిల్లాలో బడుల వద్దకు సైతం పోలీసులు వెళ్లి నోటీసులు అందజేయడం, బడుల వద్ద నుంచి ఇంటికెళ్లే వరకూ వెంబడించడం సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. మరి నూతన సంవత్సరంలో పాలకుల తీరు మారుతుందా లేక కక్షసాధింపు ధోరణి కొనసాగుతుందా అనేది వేచిచూడాలి.

ఇక జిల్లాలో పోలవరం నిర్వాసితులు తమకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం, ప్యాకేజీ అందించాలని, ఏజెన్సీలో అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తమకు హక్కు కల్పించాలని గిరిజనులు, ఎర్రకాల్వ మిగులు భూములు పంచాలని ఆ ప్రాంత పేదలు, నరసాపురం తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేయాలని, తుందుర్రు ప్రాంతంలోని ఆక్వా ఫుడ్‌పార్క్‌ను తీరంలో ఎవరికీ ఇబ్బంది లేని ప్రాంతానికి తరలించి ఆ ప్రాంతంలో ఆక్వా యూనివర్సిటీ నిర్మించాలని, దగ్గులూరులో మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని, హామీ మేరకు వాటర్‌గ్రిడ్, నరసాపురం, కోడేరు ప్రాంతాల్లో వశిష్ట గోదావరిపై వంతెనల నిర్మాణం, జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లు అన్నింటినీ వెంటనే లబ్ధిదారులకు అందజేయాలనే డిమాండ్స్ చాలా ఉన్నాయి. మరి వీటన్నింటిపై పాలకులు, అధికారులు కొత్త సంవత్సరంలో ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

2024లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో నేతలకు ఎన్నికల జ్వరం పట్టుకుంది. ఈ నేపథ్యంలో తమ ఆకాంక్షల్లో కొన్నింటినైనా ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశలో జిల్లావాసులు ఉన్నారు. వారి ఆశలు.. ఆకాంక్షలు నెరవేరాలని, దానికోసం అవసరమైతే 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు' తప్ప అన్న మహాకవి పలుకులకు అనుగుణంగా పోరుబాట పట్టడమే కర్తవ్యంగా ముందుకు సాగాలని కోరుకుంటూ.. మరోసారి అందరికీ 'నూతన సంవత్సర శుభాకాంక్షలు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి – ఏలూరు

ప్రభుత్వ ఉద్యోగమంటే చాలా బాధ్యతాయుతమైందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎపిఎన్‌జిఒ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను, ఏలూరు తాలూకా క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ప్రభుత్వ సిబ్బంది నిరంతర విద్యార్థిగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో ఇంకా బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోవిడ్ వైరస్‌ను ఎదుర్కొనేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌జిఒ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరనాథ్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ కె.నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా తాలూకా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




ప్రమాణస్వీకారం చేస్తున్న యుటిఎఫ్ చాట్రాయి నూతన కమిటీ

యుటిఎఫ్ చాట్రాయి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి – చాట్రాయి

చాట్రాయి మండల కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ మండల నాయకులు చంటి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎలాంటి హామీ ఇవ్వకుండానే కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేశాయన్నారు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా వాగ్దానం చేసి ఇప్పటివరకు ఆ మాటను నిలబెట్టుకోలేకపోయారన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసేదాకా యుటిఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పంతగాని వీరకోటి మాట్లాడుతూ చాట్రాయి మండలంలో యుటిఎఫ్‌ను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ ఎస్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, బి.అనూరాధ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వేముల పెద్ద రమేష్, వీరాల రఘు ఎన్నికయ్యారు. వారితో యుటిఎఫ్ కోశాధికారి జి.సత్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.



ఆందోళన చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

వికాస్‌బాబుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

వికాస్‌బాబుపై దాడి చేసి మృతికి కారకులైనవారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ 32 మర్డర్ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ నాయకులు అందురు ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వికాస్‌బాబు చనిపోయి ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా కైకలూరు ఎస్ఐ నిందితులతో కుమ్మక్కై కేసును తారుమారు చేస్తున్నారన్నారు. వికాస్ బాబు తండ్రి రాజు కేసు పెడితే పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తున్నారన్నారు. వికాస్ బాబు తండ్రితో ఎవరూ మాట్లాడినా వారిపై కూడా కేసు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా నిజాన్ని వెలికి తీసి వికాస్‌బాబు పై దాడి చేసినవారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేకపోతే దళిత జెఎసి తరపున దళిత ప్రజా సంఘాలను ఐక్యం చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఫ్రాన్సిస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు బి.డేవిడ్‌రాజ్, జోసఫ్ రాజ్, రాధ, మేరీ బేబీ, శాంతి, శ్రీను పాల్గొన్నారు.

కొత్త సంవత్సర వేడుకలు వ్యతిరేకిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

నూతన సంవత్సర వేడుకలను వ్యతిరేకిస్తూ పిడిఎస్‌యు, పివైఎల్, పిఒడబ్ల్యు, అరుణోదయ సంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు కె.పోతురెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ అధ్యక్షులు కారం అరుణ మాట్లాడుతూ ప్రజాసంస్కృతి, ప్రజాపోరాటాల సంస్కృతిని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకలు యువతను చెడుమార్గం పట్టిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, పలువురు విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : యువత మందుకు, విందులకు, చిందులకు దూరంగా ఉండాలని, మద్యం అమ్మకాలను పూర్తిగా రద్దుచేయాలని, నాటుసారాను పూర్తిగా అరికట్టాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు భూషణం, కె.నాగేశ్వరరావు, టి.బాబూరావు, రమేష్, యు.వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

ముసునూరు: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అన్నిరంగాల్లోనూ రాణించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎం.నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని రమణక్కపేటలో పిహెచ్‌సి వైద్యులు ఎమ్‌డి కరిముల్లా ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, బోధన విషయాలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కుడా పరిశీలించి, గర్భిణులకు, బాలింతలకు, విద్యార్థులకు అందించే పౌష్టికాహారం వివరాలను తనిఖీ చేశారు.

రూ.వంద కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు : జెడ్‌పి ఛైర్మన్

ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామస్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.వంద కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రణాళిక, ఆర్థిక, పనుల, స్థాయి గ్రామీణాభివృద్ధి విద్యా, వైద్య, వ్యవసాయ, మహిళా సంక్షేమ, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేసిన రూ.వంద కోట్లతో చేపట్టిన పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయన్నారు. ఈ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు సంబంధిత జెడ్‌పిటిసిలకు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఖచ్చితంగా తెలియజేయాలని ఆయన ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకం కింద అమలు చేసే అన్ని సంక్షేమ ఫలాలు ఖచ్చింతంగా అందుతాయన్నారు. సమావేశంలో ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అందించడంతోపాటు ఆయా కార్యక్రమాల ద్వారా చేపడుతున్న పనులు పురోగతిని సంబంధిత శాఖల అధికారులు జెడ్‌పి ఛైర్మన్, ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పిటిసి సభ్యులకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న పలు సమస్యలను ఈ సందర్భంగా స్థాయీ సంఘాల సభ్యులు జెడ్‌ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ సభ్యులు సమావేశంలో తెలిపిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేయాలని ఆధికారులను ఆదేశించారు.

ఈ సమావేశాల్లో శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జీ, జెడ్పి వైస్ ఛైర్మన్లు పోసిన శ్రీలేఖ, పి.విజయబాబు, జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.ఏసుదాసు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడే పత్రిక ప్రజాశక్తి : ఎంపిపి

ప్రజాశక్తి – ముదినేపల్లి

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడే పత్రిక ప్రజాశక్తి అని ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కొనియాడారు. ముదినేపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ క్రైమ్యు అధ్యక్షతన నిర్వహించిన సభలో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మంచి కథనాలను ప్రచురిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలబడి ప్రజాశక్తి పని చేస్తోందన్నారు. ఈ క్యాలెండర్ తమతోతో ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజాశక్తి దిన పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, దళితనేత నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అనునిత్యం వెలికి తీస్తూ, నిజాయితీగా నిర్భయంగా వార్తలను ప్రచురించే సామర్థ్యం ఒక ప్రజాశక్తికి మాత్రమే ఉందన్నారు. గ్రామ సర్పంచి క్రైమ్యు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా ప్రజాశక్తి దిన పత్రిక నిలుస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, బడుగు, బలహీన మైనార్టీ వర్గాల ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మోట్రు ఏసుబాబు, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, దళిత నేతలు దాసరి శ్రీనివాసరావు, గూడపాటి వరప్రసాద్, వైసిపి నేతలు రాంబాబు కుమార్, దివి సతీష్, పేర్నీ ఫ్యుస్సీ, వివిధ దిన పత్రికల విలేకరులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జి.చంద్రశేఖర్, పి.నందేశ్వరరావు, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్.నాగరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిపి సత్యనారాయణ


సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎకు సిపిఎం వినతి

ప్రజాశక్తి – చాట్రాయి

ప్రజా సమస్యలను పరిష్కరించాలని గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందించారు. మండలంలోని చిన్నంపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల నాయకులు కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కోనేరు రంగారావు విగ్రహం వద్ద నుంచి ఎంఆర్ అప్పారావు సాగునీటి వాటర్ ట్యాంక్ వరకు రోడ్డు అధ్వానంగా తయారై గ్రామస్తులు, రైతులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు. ఎంఆర్ అప్పారావు సాగునీటి ట్యాంకు పరిధిలో ఉన్న పేద రైతుల భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించుకున్న కాలనీ ఇళ్లకు బిల్లులు ఇప్పించాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎగుమతి చేసుకోవడానికి తగినన్ని లారీలు పంపించాలని కోరారు. కరెంటు అధికారులు కావడంతో విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొమ్ము ఆనందం మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బాగుందని, కానీ తన కుటుంబంలోనే తన అమ్మాయికి జగనన్న విద్యా దీవెన డబ్బులు పడలేదని చెప్పారు. అర్హత ఉండి కూడా తమ కుటుంబానికి ఒక్క పథకం కూడా రాలేదన్నారు. పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యలన్నీటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్. దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి పరసా ధనలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు మిద్దె రాధ, పిఎసిఎస్ అధ్యక్షులు పరసా చెన్నారావు, ఎంపిడిఒ ఎన్..మురళీ మోహన్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు



కార్మికులకు దుస్తులు అందిస్తున్న సర్పంచి

పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి – ఉంగుటూరు

నూతన సంవత్సరం సందర్భంగా కైకరం గ్రామ పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి సర్పంచి సలగాల గోపీ శనివారం దుస్తులు అందించారు. కైకరం పంచాయతీ సెక్రటరీ నాగేంద్ర కుమార్, జూనియర్ అసిస్టెంట్ శేషుబాబు, బిల్ కలెక్టర్ రెడ్డి చేతుల మీదుగా దుస్తులను అందించారు.

'లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి'


ప్రజాశక్తి – ఏలూరు

ఈ నెల 27వ తేదీ నుంచి నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి ఏలూరు ఇన్‌ఛార్జి బడేటి చంటి పిలుపునిచ్చారు. ఆయన రకార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 400 రోజులు 4000 కిలోమీటర్ల పొడవునా పాదయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వినతి పత్రంలో లోకేష్‌బాబుకు అందిస్తే టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిష్కరిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో దాసరి ఆంజనేయులు, చోటే వెంకటరత్నం, నిరంజన్, బాలాజీ, ప్రసాద్ పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


ప్రజాశక్తి – టి.నరసాపురం

సమాజంలో జానపద, పౌరాణిక బుర్రకథ కళలను ప్రోత్సహించాలని ప్రముఖ బుర్రకథ భజన గురువు మామిళ్లపల్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో ముక్కోటి ఉత్సవాలను పురస్కరించుకుని సీతారామచంద్ర ఆలయ ప్రాంగణంలో సరస్వతి బుర్రకథ దళం వీరమల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుర్రకథ, భజన గురువు మామిళ్ళపల్లి సుబ్బారావు, సామ్రాజ్యం దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా కళామతల్లి సేవలో ఎంతోమంది కళాకారులను తయారు చేయటం ఆత్మసంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పుట్టిన గడ్డపై సన్మానం పొందటం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు నందకుమార్, తిప్పర్తి వీర బ్రహ్మాచార్యులు, టివిఎస్.రాజు, బచ్చు జగన్మోహన్‌రావు, వీరమల్ల మధు, కొనకళ్ల అప్పన్న, పుల్లారావు, దారా ధనంజయరావు, కొనకళ్ల అచ్యుతరావు పాల్గొన్నారు.



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న వక్తలు

దళిత సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆకుమర్తి రామారావు

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో దళిత సమస్యలపై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ సేవాసమితి వ్యవస్థాపకులు ఆకుమర్తి రామారావు అన్నారు. మండలంలోని పేరంపేట గ్రామంలో జై భీమ్ జైతెలుగుదేశం, దళిత వాడలకు ఆకుమర్తి కార్యక్రమంలో భాగంగా దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకుమర్తి రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల కష్టాలు తీరాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. అనంతరం క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.రెండు వేలు అందించారు. 350 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిపి నాయకులు గోలీ రామకృష్ణారెడ్డి, గ్రామ కమిటీ ప్రెసిడెంట్, కంకిపాటి కుమారి, పంచాయతీ సర్పంచి శిల్పరెడ్డి, ఇంద్రాణి, చింతలపూడి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, చిలపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, గోలి సత్తిరెడ్డి గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గంటా రామారావు, జగజ్జీవన్‌రావ్ యూత్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు గ్యారెంటీలు లేవనే సాకుతో

ధాన్యం కొనుగోలు నిలిపివేత అన్యాయం

ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ధాన్యం లోడ్ ట్రాక్టర్లతో రైతులు ధర్నా

ప్రజాశక్తి – ఏలూరు రూరల్

మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు లేవనే పేరుతో రైతులు ట్రాక్టర్లలోకి లోడ్ చేసిన ధాన్యానికి ట్రక్ షీట్లు ఇవ్వకుండా ధాన్యం కొనుగోలు నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జాలిపూడిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం (సహకార సొసైటీ) వద్ద ధాన్యం లోడ్ చేసిన ట్రాక్టర్లతో శనివారం ధర్నా నిర్వహించారు. ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించి రైతుల నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు డిమాండ్ చేశారు.

ఈ ధర్నానుద్దేశించి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జాలిపూడి సొసైటీ పరిధిలో జాలిపూడి, మాదేపల్లి గ్రామాల్లో 3010 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 806 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. రైతులకు సరిపడు సంచులు అందించారని, ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని సంచుల్లోకి ఎక్కించి ట్రాక్టర్లపైకి లోడ్ చేసి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకెళ్తే మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు అయిపోయాయని ఫలితంగా ఆన్‌లైన్‌లో ట్రక్ షీట్లు జనరేట్ కాకపోవడంతో ధాన్యం కొనుగోలు నిలిచిపోయిందని ఆందోళన చేశారు. రైతులు, కౌలు రైతుల నుండి ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ గ్యారంటీలు, ఆన్‌లైన్ వంటి సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. జాలిపూడి, మాదేపల్లి గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు.కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సొసైటీ సిబ్బంది పని చేస్తున్నా సాంకేతిక కారణాలతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతులు అమ్మిన ధాన్యానికి సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జాలిపూడి సొసైటీ పరిధిలో ఏర్పడిన ధాన్యం కొనుగోలు సమస్యపై జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో సంప్రదించగా ఆన్‌లైన్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చేస్తున్నట్లు ప్రకటించడంతో రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగం సత్య గణేష్, కటారి ఆంజనేయులు, నల్లూరి శ్రీనివాసరావు, తిరుపతి రంగారావు, గుడాల శ్రీనివాసరావు, కేతా రాంబాబు, గండికోట తిరుపతయ్య కాట్రగడ్డ రాజా, బండి జరుగులు, బండి శ్రీనివాసరావు, వేంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణలో ఆలసత్వం వద్దు

ఇన్‌ఛార్జి కమిషనర్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

నగరంలో పారిశుధ్య నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కమిషనర్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. స్థానిక సత్రంపాడు నుంచి ఫైర్ స్టేషన్ వరకూ శనివారం సంబంధిత అధికారులతో కలిసి పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచే బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదేనని పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్ల వద్ద సర్దుబాటు చేసి నిర్దిష్ట సమయంలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా శానిటరీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని పారిశుధ్య విభాగం సిబ్బంది, మేస్త్రీలు, ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లోని వ్యర్థాలను తొలగించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతతో విధులు నిర్వర్తిస్తే ఆ ఘనత మీతో పాటు నగరపాలక సంస్థ యంత్రాంగంపై ఉంటుందన్నారు.

నగరంలో సుందరీకరణ పనులు: స్థానిక టిటిడి కల్యాణ మండపం నుంచి శాంతినగర్ పోలీస్ పెట్రోల్ బంక్ వరకు అధునాతన పుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పుట్‌పాత్ నిర్మాణంతోపాటు కార్పెట్ గ్రాస్ ఏర్పాటు చేసి మొక్కలు నాటాలన్నారు. నిర్మాణంలో భాగంగా పుట్‌పాత్ లైటింగ్, విశ్రాంతి తీసుకునేవారు కూర్చోవడానికి వీలుగా బెంచీలను ఏర్పాటు చేసి సుందరీకరణ పనులను చేపట్టాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ బాపిరాజు, కార్పొరేషన్ హెల్త్ అధికారి డాక్టర్ మాలతి, ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఎంఇ భాస్కర్ రావు, ఎసిపి శాంతిలత, డిఇలు, ఎఇలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వివక్ష దగదు

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల అసహనం

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులల్లో వివక్ష తగదని మున్సిపల్ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ సమావేశం హాలులో ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలుఅభివృద్ధి పనులపై సమీక్షించారు. 38 అంశాలతో కూడిన ఎజెండా ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో ఐదో వార్డు కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ పాలకవర్గ సభ్యులందరికీ సమన్యాయం పాటించాలని కోరారు. తన వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ స్థానంలో ఉన్నవారు ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ వార్డు అభివృద్ధికి సహకరించాలన్నారు. తొమ్మిదో వార్డులో 240 మీటర్ల రోడ్డుకు రూ.ఆరు లక్షలు కేటాయించి ఒకటో వార్డులో అదే విస్తీర్ణం కలిగిన రోడ్డుకు రూ.12 లక్షలు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఛైర్పర్సన్ మాట్లాడుతూ ప్రజల అత్యవసర సేవలు మినహా అన్నివార్డుల అభివృద్ధిపై దృష్టిసారించామని తెలిపారు. కాంట్రాక్టర్లు సకాలంలో పని చేయక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అలాగే 27వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి మాట్లడుతూ ఇటీవల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో హ్యాండ్‌వాష్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం అందలేదన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ల వాట్సప్ గ్రూపు నుండి తన ఫోన్ నెంబర్ ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. 27వ వార్డులో రోడ్డు ఆక్రమణలపై ప్రశ్నించినందుకు తనపై వివక్షత కనబరుస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో నీటి పన్నుల పెంపుదలపై పలువురు కౌన్సిలర్లు అభ్యంతర వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న అనధికార కుళాయిలను గుర్తించి క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవి రత్నం, పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి – టి.నరసాపురం

జగనన్న కాలనీల లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జి.సుధాకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మక్కినవారి గూడెం, బండివారిగూడెం గ్రామాల్లో హౌసింగ్ డే పురస్కరించుకొని జగనన్న కాలనీ లబ్ధిదా రులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలందరికీ నూతన గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి, హౌసింగ్ ఎఇ జి.రాధాకృష్ణ, ఎపిఒ శ్రీనివాస్, బండివారిగూడెం సర్పంచి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : జగనన్న గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ మణికుమారి అన్నారు. మండలంలోని ఉర్లగూడెంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యువరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని అంతర్వేదిగూడెం గ్రామ పరిధిలో మంజూరైన గృహ నిర్మాణ పనులను పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద గృహ నిర్మాణాల పనులపై శనవారం లబ్ధిదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్వేదిగూడెం పరిసర ప్రాంతాల్లో 54 పిఎంఎవై గ్రామీణ్ పథకం ద్వారా గృహ నిర్మాణాలు మంజూరయ్యా యన్నారు. లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి, గ్రామ సర్పంచి సత్య దుర్గాప్రసాద్, ఎపిఎం పద్మావతి, హౌసింగ్ ఎఇ మణికంఠ, ఎలక్ట్రికల్ ఎఇ పాల్గొన్నారు.

త్వరలో 'శ్రీఅరవింద' గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 'గోల్డెన్ జూబ్లీ' ఉత్సవాలు త్వరలో ఘనంగా నిర్వహిస్తామని పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు నిర్ణయించారు. గాంధేయవాధి, కీర్తిశేషులు చింతలపాటి మూర్తిరాజు 1969లో కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి ఈ కళాశాలలో చదివి ఉద్యోగ, వ్యాపారాల్లో వేలాది మంది స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు కార్యాచరణ ప్రణాళికపై కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశమైంది. త్వరలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేసేందుకు నిర్ణయించారు. ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు, పూర్వ విద్యార్థులు, కళాశాలల అభివృద్ధి కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారునికి సాయం

కలిదిండి: వాలీబాల్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన విద్యార్థి గరికిముక్కుల స్రవంతికి స్థానిక ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన స్రవంతి కైకలూరు వైఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో కృష్ణా యూనివర్శిటీ తరపున స్రవంతి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. అనంతరం కేరళలో జరిగిన పోటీలలో తమ టీమ్ రన్నర్‌గా గెలుపొందినట్లు స్రవంతి తెలిపారు. తొలుత నుండి ఎంపిటిసి నీలి సుమన్ తనను ప్రోత్సహిస్తూ తన గెలుపుకు ఆర్థిక సాయం అందించారన్నారు. స్థానిక మస్తాన్ బాబా ఫెర్టిలైజర్స్ ఆవరణలో గరికిముక్కుల స్రవంతిని నీలి సుమన్ తదితరులు సన్మానించి, అభినందనలు తెలిపారు. పేద వర్గాల కుటుంబాలకు సాయం అందించేందుకు ముందుంటానని సుమన్ అన్నారు.